

# కథ

మల్లాది రమాంజలి

# కెపిరావు-చుక్కల చీర

నిండు పౌర్ణమి-

చందమామపై కొబ్బరాకులతో దోబూచులాడుతున్నాడు. భోజనం చేసి డాబా మీద నాకు ఇష్టమైన పడక్కుర్చీలో నడుం వాల్చకపోతే రాత్రి గడవదు నాకు. వక్కపొడి నములుతూ మెట్లెక్కి పైకొచ్చి కుర్చీలో వాలిపోయాను. రిటైర్‌మెంట్‌కి దగ్గరవుతున్న వయసు...బాధ్యతలు తీరిపోయి రికామీగా వున్న జీవితం. ఇంట్లో నేనూ, నా భార్యా... కొత్తగా పెళ్లయిన రోజులు గుర్తుకువస్తాయి. ఇలాంటి వెన్నెల రాత్రులలో మరీను.. అందుకు వ్యతిరేకంగా...

ఈరోజు ఎందుకో మా బామ్మ గుర్తుకువస్తోంది. ఆరు నూరైనా, భూమి తల్లకిందులైనా పుట్టింటి వారిని బయటపడేసేది కాదు. 'గుంభన' అనేది ఆవిడకి పెట్టని ఆభరణమైతే, ఆ ఆప్యాయత నేను జీవితంలో ఎక్కడా చవిచూడలేదు. మా బామ్మ గుర్తుకురాగానే చిన్నప్పటి సంఘటనలు కొన్ని గుర్తుకు వచ్చాయి నాకు.

తెల్లని చీరలు తల నిండుగా కప్పుకుని కట్టుకునేది బామ్మ. విపరీతమైన మడి, ఆచారం. పనివాళ్లను ఇంట్లోకి రానిచ్చేది కాదు. తెల్లవారు ఝామునే లేచి మేలుకొలుపులు, విశ్వరూపం రాగయుక్తంగా పాడేది.

"ఒరే సాంబడూ! లేవరా... తెల్లవారుఝామునే లేచి చదువుకుంటే చదువు బాగా వస్తుంది" దుప్పటి ముసుగు లాగేసి చెవిలో రొద పెట్టేది,

"ఊ... ఏమిటి బామ్మా! చెవిలో ధార కొడతావు?" బద్ధకంగా అనేవాడిని. 'ధార' అంటే నా భాషలో 'పదే పదే' అన్నమాట. మరో అరగంటకు లేచి కునికిపాట్లు పడుతూ చదివేవాడిని.

"పిచ్చి నాయనకి నిద్దరెక్కువ" ముద్దుగా అనేది బామ్మ.

అప్పట్లో ఊరంతటికీ ఒకే మంచినీళ్ల బావి వుండేది. మా ఇంటికి రెండు బజార్ల అవతల వున్నా తెల్లవారకుండానే తడిబట్టలు కట్టుకుని భుజం మీదో బిందె, చేతిలో నీళ్లు తోడే బొక్కెన పట్టుకుని గబగబా నడుచుకుంటూ ఇంటికి వచ్చేది. మధ్యలో ఏ కడజాతి వాళ్లో కనబడితే నీళ్లన్నీ పారబోసి మళ్లీ నింపుకొచ్చేది.

"మీది మరీ చాదస్తం అత్తయ్యా! ఉదకం నారాయణ స్వరూపమని మీరే అంటారు...నారాయణుడికి 'మైల' అంటుతుందా?" అని అమ్మ అంటే-

"ఏమోనే అమ్మడూ! తాతల కాలంనుంచీ ఇదే పద్ధతి. ఇప్పుడు ఎలా మార్చుకోనూ" దీర్ఘం తీసేది.

మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఏ కొబ్బరి ఈనెలో తీసి చీపురు కట్టలు కడుతూ భోజనానికి టైముకి వచ్చేది కాదు. అమ్మ చెప్పగా చెప్పగా కట్టుకున్న బట్ట తెల్లగా ఉతికి ఆరేసి, ఏ మూడు గంటలకో భోజనం చేసి ఓ అరగంట నడుం వాల్చి, మళ్లీ ఏ ఒత్తులో చేసుకుంటూ భగవన్నామ స్మరణ చేసుకునేది. నెలకో, రెండు నెలలకో మా బామ్మ వేలువిడిచిన తమ్ముడు కెపిరావు గారు భుజానికో సంచీ వేలాడేసుకుని వచ్చేవాడు.

"ఓ అర్ధరాత్రీ లేదు, అపరాత్రీ లేదు. ఈయనొకడు నా ప్రాణం తియ్యడానికి..." అమ్మ విసుక్కునేది.

"ఏమే అక్కయ్యా! ఊళ్లు తిరిగి తిరిగీ తిండిలేక ముఖం వాచి ఇక్కడికి వచ్చాను. కమ్మగా కంది పచ్చడి చేసి పెట్టవే" వచ్చీరాగానే కాళ్లన్నా కడుక్కోకుండా అరుగుమీద కూలబడి కోరికల లిస్టు చదివేవాడు.

తమ్ముడు కోరగానే ముఖం చేటంత చేసుకుని "ఏమే...అమ్మడూ...మా తమ్ముడొచ్చాడు. కాస్తంత కంది పచ్చడి రుబ్బవే" అమ్మకి ఆజ్ఞ జారీ చేసేది.

ఈయనకి పనీ పాటాలేదు. ఏదో ఉద్యోగం వెలగబెట్టానంటాడు. కనీసం పూచిక పుల్ల కూడా కూడబెట్టలేదు. పెళ్లాన్నీ, గంపెడుమంది పిల్లల్నీ వదిలి, పెళ్లిళ్ల పేరయ్యలా ఊళ్లు పట్టుకుని తిరుగుతాడు. ఇక్కడకు వచ్చి తిష్టవేస్తాడు...గొణుక్కునేది అమ్మ.

రాత్రి దీపాలు పెట్టకముందే కట్టెల పొయ్యి మీద ఇత్తడిగిన్నెకి ముగ్గురాచి అన్నం వండేది అమ్మ. కిరోసిన్ స్టౌ మీద మూకుడు పెట్టి పప్పు వేయించి రోట్లో మెత్తగా పచ్చడి రుబ్బేది. ఆరోజుల్లో గ్యాస్‌స్టౌ, మిక్సీలు, గ్రైండర్లు లేవు. అయినా చకచకా అన్ని పనులూ జరిగిపోయేవి. చేసిన పచ్చడిలో సగం కెపిరావుగారే లాగించేసేవాడు. నేనూ చెల్లాయి ఆయన వంకే ఆశ్చర్యంగా చూసేవాళ్లం. ఆయన భోజన ప్రియత్వం అమ్మకి తెలుసుగనక అమ్మ ముఖంలో కాస్తంత చిరాకు కనపడేది.

అప్పట్లో మాకో బుల్లి నులక మంచం వుండేది. మా బామ్మ కాపురానికి వచ్చేటప్పుడు వాళ్ల నాన్న దాన్ని ఆమెకు కానుకగా ఇచ్చాడట. నేను పుట్టేముందు వరకూ దాని మీద మా బామ్మ పడుకునేదిట. నేను పుట్టాక ఆ మంచం నాదైపోయింది. కెపిరావు వచ్చినప్పుడల్లా నా మంచం ఆక్రమించేసేవాడు. నా ప్రాణం లబలబలాడేది. ఆయన వెళ్లగానే ఉయ్యాలలా అయిన మంచాన్ని మా బామ్మ గట్టిగా మళ్లీ బిగించేది. ఆయన ఉన్నన్ని రోజులూ నా పడక మా బామ్మ దగ్గరే. తెల్లవార్లూ నేను తన్నే తన్నులకి కుయ్యోమొర్రో అంటూ మధ్యమధ్యలో సరిగా పడుకోమంటూ తొడపాశం పెట్టేది విసుక్కుంటూ..

నాన్న ఎప్పుడూ తన పొలం పనులలో మునిగి తేలేవారు. వేలు విడిచిన మేనమామ అయినా ఆయనతో ముభావంగా ఉండేవారు. బామ్మ మాత్రం తన పుట్టింటి వాళ్ల కబుర్లన్నీ అడిగి తెలుసుకుంటూ వుండేది.

ఓ నాలుగు రోజులు వుండి తనకిష్టమైన వంటలన్నీ చేయించుకుని తిని తన ఊరు వెళ్లిపోయేవాడు కెపిరావు. ఆయన వెళ్లగానే తేలిగ్గా ఊపిరి పీల్చుకునేది అమ్మ.

మా పనిమనిషి రత్తాలు మర్నాడు పనిలోకి రాగానే "మీ తమ్ముడుగారు ఎళ్లిపోయారాండీ...పెద్దమ్మగోరూ" బామ్మను ప్రశ్నించేది.

"ఆహా! వెళ్లాడు పాపం...గంపెడు సంతానం వాడికి ఏదో పొట్టచేత పట్టుకుని ఊరూరా తిరుగుతూ వుంటాడు. మళ్లీ పై నెల్లో వస్తానన్నాడు" సమాధానమిచ్చేది బామ్మ.


"అమ్మో! మల్లానా అమ్మగోరూ...చిన్నమ్మగోరి నడ్డి ఇరిగిపోతాది..ఒండిపెట్టలేక" నిర్భయంగా అనేది రత్తాలు.

"ఏమే...నీ పని నీవు చేసి వెళ్లక నా పుట్టింటివారిని అంటావుటే.. నీ మొహం మండ...నీ సొమ్మేమన్నా పెడుతున్నావా వాడికి" గయ్యిమనేది బామ్మ.

"నాకెందుకులే అమ్మగోరూ... ఊసుబోక అన్నాను. సెమించండి" రత్తాలు భుజాలు తడుముకుంటూ అవతలికి వెడుతుంటే వీరి సంభాషణకి ముసిముసిగా నవ్వుకునేది అమ్మ.

ఆ యేడు వేసవి సెలవులకని మా మేనత్త, పిల్లలూ వచ్చారు. ఇక చెల్లాయికీ, నాకూ సందడే సందడి. గోడలూ, గొప్పులూ ఎక్కి బాగా అల్లరిచేసేవాళ్లం. మగపిల్లలందరం ఒక చోట, ఆడపిల్లలంతా ఒక చోట ఆడేవాళ్లం. ఆడపిల్లలు అన్నాలాటలు, తొక్కుడుబిళ్లలు, బొమ్మల పెళ్లిళ్లు తప్ప వేరే ఆటలు ఆడేవాళ్లు కాదు. నేను అట్టపెట్టెలతో ఓ చిన్ని ప్రొజెక్టర్ తయారుచేసి, మా నాన్న తెల్లపంచెతో ఓ చిన్న తెర కట్టి ఫిలిం రోల్స్ తెచ్చి పిల్లలందరికీ సినిమాలా చూపించేవాడిని. ఇసుక మీద కూర్చుంటే ఐదు పైసలు, గడ్డి చుట్ట మీద కూర్చుంటే

పావలా టికెట్టుకి వసూలుచేసేవాడిని. సినిమా మోజు తీరేసరికి నాన్న తెల్లపంచె కాస్తా నల్లగా మురికిపట్టిపోయేది. అది చూసి కర్ర పట్టుకుని నా వెంటపడేవాడు నాన్న. నేను మా బామ్మ వెనకాల భయంగా నక్కితే- చేతులడ్డం పెట్టి- "నేను తెల్లగా ఉతికి పెడతాలేరా చెంద్రుడూ! వాడిని కొట్టకు" అంటూ నన్ను వెనకేసుకొచ్చేది. ఇలా రకరకాల అల్లర్లతో నెలరోజులు ఇట్టే గడిచిపోయేవి.



మా మేనత్త ఉండగానే ఓరోజు మళ్లీ కెపిరావు దిగబడ్డాడు. ఆయనను చూడగానే ముఖం చిట్లించింది అమ్మ. బామ్మ మాత్రం ఆయనకి ఎదురెళ్లి కుశలప్రశ్నలు వేసి మంచితీర్థం అందించింది.

"బాగున్నావటే అక్కయ్యా?" అంటూ పలకరింపులు మొదలు.. "ఏమేవ్..అన్నపూరీ...ఎప్పుడొచ్చావే...మీ ఆయన బావున్నాడా?" అత్తయ్యను పలకరించాడు.

"ఆ.. బాగున్నాను..." ముక్తసరిగా సమాధానం చెప్పి లోపలకి వచ్చేసింది అత్తయ్య. 'అన్నపూర్ణ' అనే చక్కని పేరుండగా ఈ పూరీ, చపాతీ...ఏం పిలుపు...గొణుక్కుంది అత్తయ్య. ఆ మాటే బామ్మతో అంటే-

"ఏదోలేవే...వరసయిన దానివని సరసాలాడాడులే" సమర్థించి ఈగవాలనివ్వలేదు బామ్మ.

"ఆ శుంఠతో నాకు వరసేమిటే" అంటూ ఇంకా ఉడుక్కుంటూనే వుండేది అత్తయ్య.




మళ్లీ షరా మామూలే. ఓ నాలుగు రోజులు వుండి ప్రయాణమయ్యాడు కెపిరావు. ఈసారి ఆయన వెళ్లిన దగ్గరనుంచీ మా అమ్మ అప్పుడప్పుడు అపురూపంగా కట్టుకునే చుక్కల చీర కనపడకుండా పోయింది. ఇల్లూ, వాకిలీ మొత్తం వెదికాం. ఎలకలు ఈడ్చుకెళ్లాయేమోనని అటక ఎక్కించి మరీ చూసింది బామ్మ. చీర మాత్రం ఎక్కడా కనబడలేదు. "అయ్యో! బంగారం లాంటి చీర...పాతిక పెట్టి కొన్నాను...ఎవరు పొట్టన పెట్టుకున్నారో" అమ్మ శాపనార్థాలు పెట్టింది.

"అమ్మడూ! ఆ రత్తాలు తీసిందేమోనే...ఏముందీ...నలుగురూ పచ్చగా వుంటే ఓర్వలేని కళ్లు అనేకం ఉంటాయి" తన సందేహం వెలిబుచ్చింది బామ్మ.

"అబ్బే! రత్తి అలాంటిది కాదు అత్తయ్యా! నేను కాపు రానికి వచ్చిన దగ్గర్నుంచీ నమ్మకంగా పనిచేస్తోంది పాపం. వస్తువో చోట అనుమానం ఓ చోట అవుతుం దేమో" అన్నది అమ్మ.

"ఏమోనే...నాకైతే ఆ రత్తాలు మీదే అనుమానం. ఉండు రేపొచ్చాక దాన్ని నాలుగూ కడిగిపారేస్తాను" అంటూ అప్పటికి వెతకటం ఆపేసింది బామ్మ.

* * *

మర్నాడు రత్తాలు పనికి వచ్చేసరికి వీధిగేటు దగ్గరే కాపలా కూర్చుంది బామ్మ.

"ఏంది పెద్దమ్మగోరూ! ఈడ కూకున్నారేటి?" ప్రశ్నించింది రత్తాలు.

"ఏమే నా కోడలి చుక్కలచీర ఏం చేసావు చెప్పు?" ఉగ్రంగా అంటూ నిలదీసింది బామ్మ.

"ఏ సుక్కల సీరండీ...నిన్న ఉతికి ఆరేసి పోనాను గందా! నానేం సేసుకుంతాను" తెల్లబోయింది రత్తాలు. బామ్మకీ, రత్తాలుకీ మాటా మాటా పెరిగింది. చింతబ రికె తీసుకుని దాని నడ్డిమీద ఒక్కటేసింది బామ్మ. రత్తాలు ఏడ్చుకుంటూ ఇంటికెళ్లిపోయి, మర్నాటి నుంచీ పత్తాలేదు.

ఇంట్లో ఐదుగురం చిన్నపిల్లలం, నలుగురు పెద్ద వాళ్లు, పూట పూటా ఇంటెడు సామాన్లూ, వాటెడు గుడ్డలూ ఉతకలేక అమ్మకీ, అత్తయ్యకీ నడ్డి విరిగిపో యింది.

"రాక రాక సెలవలకని వస్తే నాకీ చాకిరీ ఏమిటే అమ్మా! రేపే నేను మా ఇంటికి వెళ్లిపోతాను" నడుముకి మందు రాసుకుంటూ తల్లిని దెప్పి పొడిచింది అత్తయ్య. వంచిన తల ఎత్తలేదు బామ్మ.


"రేపల్లె అమ్మవారికి మొక్కుబడి వుందే అమ్మాయ్! అది అయ్యాక వెదుదువుగానిలే" సన్నగా గొణిగింది.

మర్నాడే అందరం రేపల్లె బయలుదేరాం. పులిగడ్డ వెళ్లి రేవులో పడవెక్కాలి. పడవెక్కటం నాకు అదే మొదలు. కృష్ణలో నీళ్లు పెద్దగా లేవు. నీళ్లు ఉన్నంత వరకూ పడవలో ప్రయాణం... ఆ తర్వాత అందరం ఇస కలో నడిచి మొత్తానికి రేపల్లె చేరుకున్నాం. ముందు మా తమ్ముడింటికి వెళ్లి సామాన్లవీ అక్కడ పెట్టుకుని గుళ్లోకెళ్లొద్దాం అన్నది బామ్మ. సరే నంటే సరే అనుకుని కెపిరావు గారి ఇల్లు అక్కడే కావటంతో వాళ్లింటికి బయలుదేరేం.

మా అందరినీ ఒక్కసారిగా చూడ డంతో కెపిరావు, ఆయన భార్య తెల్ల బోయి వెంటనే తెప్పరిల్లి నడవాలో ఓ కుక్కిమంచం, చిరుగుల చాప పరిచి, చల్లని మంచి నీళ్లు అందించారు. చిన్నా పెద్దా కలిసి ఆయనకు పది మంది కుచేల సంతానం. అక్కడక్కడ సున్నపు బెత్తికలు ఊడిపోయిన గోడలు, అక్కడక్కడ పెంకులు ఎగిరిపోయినట్టున్న పాత పెంకుటిల్లు. సూర్యుడు నట్టింట్లో కాపురం చేస్తున్నట్టుంది ఇల్లు. కాసేపు మాతో కూర్చున్నట్టే కూర్చుని వంటగదిలో కెళ్లి అటూ ఇటూ అయోమయంగా చూస్తోంది కెపిరావు భార్య మీనాక్షి.

"ఏవమ్మోయ్ మరదలు పిల్లా! మా కోసం నువ్వు భోజనాల ఏర్పాట్లవీ చూడనక్కరలేదు. మేం తెల్లారకట్ట లేచి పులిహోర, దద్ధోజనం చేసుకునే వచ్చాం.

దేవుని దర్శనం చేసుకుని అవి ఇంత నోట్లో వేసుకుని సాయంత్రం ఇంటికి చేరు కుంటాం" పెద్దగా చెప్పింది బామ్మ.



బ్రతుకు జీవుడా అన్నట్టుగా మీనాక్షి ఇవతలకి వచ్చి- "పోనీ దబ్బాకుల మజ్జిగన్నా తాగండి ఒదిన గారూ!" అంటూ చల్లని మజ్జిగ మా అందరికీ ఇచ్చింది. ఎండనపడి ప్రయాణం చేసిన మా ప్రాణాలు మజ్జిగ తాగేసరికి కొంచెం కుదుటపడినాయి.

అందరం గుళ్లోకి బయలుదేరాం. మీనాక్షిని కూడా తమతో రమ్మని పిలిచింది బామ్మ. అన్నదే తడవుగా చక్కగా ముస్తాబై బయటకు వచ్చింది మీనాక్షి. ఆశ్చర్యం...మా అమ్మ పోయిందనుకున్న తన చుక్కలచీర లాంటిదే మీనాక్షి ఒంటిమీద దర్శనమిచ్చింది. సంబరంగా చీర సవరించుకుంటూ-

"ఆయన తెచ్చారు ఒదినగారూ! బాగుందా?" మురిసిపోతూ ప్రశ్నించింది.

ఆశ్చర్యం నుంచి తేరుకోలేని బామ్మ అటూ ఇటూ బుర్ర గిరగిరా తిప్పి అయోమయంగా అందర్నీ అనుసరించింది. పిల్లల ఒంటి మీద సరైన గుడ్డ లేదు... పాతిక పెట్టి ఈవిడకి చీర తెచ్చాడట మొగుడు...నాదే ఈ చీర...ఎత్తుకొచ్చి దొంగ మాటలు చెపుతున్నారు... అమ్మ గొణుక్కోవటం నా చెవులతో విన్నాను.

భార్య ఆ చీర కట్టుకోవటం గమనించిన కెపిరావు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయి పని ఉందంటూ బజారుకి ఉడాయించాడు.

* * *

రేపల్లె నుంచి తిరిగి వచ్చిన దగ్గర్నుంచీ బామ్మ అందరితో ముభావంగా వుంటోంది. తన పుట్టింటి వాళ్ల గురించి గొప్పలు చెప్పటం ఎన్నోసార్లు విన్నాను నేను. బహుశా తన తమ్ముడు చీర దొంగిలించటం ఆవిడకు ఆశ్చర్యం కలిగించి ఉండవచ్చు...అమ్మ దగ్గర అవమానం అయివుండవచ్చు... ఆ సంఘటన జరిగి నాలుగైదు నెలలయినా మళ్లీ మా గడప తొక్కలేదు కెపిరావు.

మరో నాలుగు రోజుల తర్వాత జ్వరం వచ్చి మంచం నుంచి లేవలేకపోయింది అమ్మ. పని భారమంతా బామ్మ మీద పడింది. మా ప్రహరీ గోడకి అల్లంత దూరంలోనే రత్తి గుడిసె. మా గోడెక్కితే రత్తి గుడిసె కనిపిస్తూనే వుండేది. నాలుగు రోజులు చాకిరీ చేసేసరికి విసిగెత్తిపోయిన బామ్మ గోడ దగ్గరకు చెక్క స్టూలు జరుపుకుని రత్తిని పిలవటం మొదలుపెట్టింది ఆ రోజు సాయంత్రం. బామ్మ కేక విని రత్తి మొగుడు గుడిసెలోకి తొంగి చూసి-

"ఏమేవ్! పెద్దమ్మగోరు పిలుత్తున్నారు"

## తమిళమే మేలు

శ్రియ నటించిన 'మల్లన్న' తమిళనాట 'కందసామి'గా రిలీజై తెలుగులో కంటే కాస్త మంచి రిజల్టే ఇచ్చిందిట. దీంతో శ్రియ తన టాలీవుడ్ చాన్సుల గురించి ఇక ఆలోచించడం మానేద్దామనే అనుకుంటోందిట. ప్రస్తుతం నాలుగైదు తమిళ సినిమాలు చేస్తున్న శ్రియ వాటిలో ఏ ఒక్కటి హిట్టయినా కోలీవుడ్‌లో తన కెరీర్ మళ్లీ ఊపందుకుంటుంది గనుక తన దృష్టంతా తమిళ రంగంపైనే నిలపాలనుకుంటోందని ఆమె సన్నిహితులు చెప్పుకుంటున్నారు. తెలుగు రంగం ద్వారా పరిచయమైన శ్రియకి ఇక్కడ నిరాశ ఎదురుకావడం దురదృష్టమే!

అన్నాడు.

కొంగుకు చేతులు తుడుచుకుంటూ పరుగెత్తుకొచ్చింది రత్తి.

"ఒసేవ్ రత్తాలూ! నాలుగుద్ద నూరేళ్లు ఉండదు.. ఏదో పెద్దదాన్ని...నా మాటలన్నీ మనసులో పెట్టుకోక... చిన్నమ్మకి జ్వరం వచ్చింది. కాస్తంత పనిలోకి రావే" అన్నది.

"చింత బరికె పెట్టి కొట్టీసినారు గదండీ...ఆ దెబ్బకి నడుంకాడ సెర్మం వాసిపోనాది. కూటికి పేదోల్లం గానీ గునానికి పేదోల్లం కాదమ్మా! సుక్కల సీర నేదియ్యలా...ఏ దొంగెదవ కాజేసిండో... ఇంతలా అడుగుతుండారు..మీ ఉప్పూ పప్పూ తిన్న ఇశ్వాసంతో సిన్నమ్మ మొకం సూసి పనిలోకొత్తా" అన్నది రత్తి.

"ఏ రాయి అయితేనేమే పళ్లూడగొట్టుకో దానికి...నేనైతేనేమి...నా కోడలైతేనేమి..రేపటి నుంచీ పనిలోకిరా..." అధికారంగా అంటూ చెక్క స్టూలు దిగి ఇంట్లోకి వచ్చింది బామ్మ.

మర్నాడు మధ్యాహ్నం...

ఇక మా ఇంటి గడప తొక్కడనుకున్న కెపిరావు మళ్లీ ఊడిపడ్డాడు. అయనను చూడగానే మునుపటిలా ముఖం విప్పార్చుకుని మాట్లాడలేదు బామ్మ. అయనను చూడగానే ముఖం మాడ్చుకునే అమ్మ ఆరోజు ఆశ్చర్యంగా అయనకు కుర్చీవేసి కూర్చోమని, చల్లని మంచినీళ్లు అందించింది. ఎప్పటిలా అయన ముఖంలో అతి ధోరణి కనపడలేదు. మౌనంగా తలవంచుకుని కూర్చుని...

"అక్కయ్యా! నేను చాలా తప్పు చేసానే. నన్ను క్షమించు...మొన్న మీరంతా మా ఇంటికి వచ్చినప్పుడు నీ మనవరాలు, నా కూతురుతో నా భార్య కట్టుకున్న చీర మా అమ్మకు కూడా వున్నది అన్నదట. ఆ మాట నా కూతురు, నా భార్యతో చెప్పటంతో నా భార్యకు నా మీద అనుమానమొచ్చి-నన్ను నిలదీసింది. నేను ఏమీ సమాధానం చెప్పలేకపోయాను. విషయం అర్థమైన నా భార్య నాతో మాట్లాడటం మానేసింది. దాంతో నా పిల్లలంతా నా మీద కత్తి కట్టినట్టు చేస్తున్నారు. నా భార్యకు నా ముఖం చూపించాలంటే సిగ్గుగా వుంది అక్కయ్యా! పైసా సంపాదన లేకపోయినా ఇన్నాళ్లూ గుట్టుగా బ్రతికాం. సందడిగా ఉండే నా ఇల్లు ఇలా మూగబోవటం భరించలేకపోతున్నాను. చిరుగుల చీరతో సిగ్గు కప్పుకునే నా భార్యను చూడలేక సంపాదించే దారి లేక ఈ పాడుపని చేసాను. నేను ఇప్పుడు తిండికోసం రాలేదు. నా తప్పు సరిదిద్దుకుందామని వచ్చాను" చుక్కల చీర గడపలో పెట్టి తల వంచుకున్నాడు కెపిరావు.

"ఈ బుద్ధి మొదటే ఉంటే బాగుండేదిరా తమ్ముడూ...ఊరూరా తిరుగుతుంటే ఏదో తవ్వి తలకెత్తుతున్నావనుకున్నాను. గంపెడు సంసారాన్ని ఏ పనీపాటా లేకుండా ఎలా ఈదుతున్నావు? అమాయకమైన నీ పిల్లల ముఖాలు, నిన్ను నమ్మి వచ్చిన మీనాక్షి ముఖం చూస్తే జాలేసింది నాకు. ఇలాంటి చీరలు ఎన్నో మా అమ్మడికి కొనిపెట్టగలను. ఈ చీర నువ్వే తీసుకో" అంటూ చీర అయన సంచిలో పెట్టేసింది బామ్మ.

"బాబాయిగారూ! మీకంటే నేనెంతో చిన్నదాన్ని. లేమితనం మీచేత ఆ పొరపాటు చేయించిందని అర్థం చేసుకున్నాను. మీ పిల్లల్ని చూస్తే జాలేసింది నాకు. ఏమనుకోకుండా మా పిల్లల బట్టలు, పుస్తకాలు మీ పిల్లలకు ఇస్తాను, తీసుకువెళ్లండి. పిల్లలకైనా ఒక దారి చూపించండి...మీ పెద్దమ్మాయి, చిన్నమ్మాయి వయసుకు వచ్చారు. చిరిగిన బట్టలతో వాళ్లు బయటకు వెళ్లటం అంత బాగుండదు. నాకు చాలా చీరలున్నాయి. కొన్ని మీకు ఇస్తాను...పిల్లలకు ఓణీలు వేయించండి" తనకు తోచిన నాలుగు మాటలు చెప్పింది అమ్మ.

"వీడి బుద్ధి సరిగా ఉంటే వీడికో దారి చూపించవచ్చునే అమ్మడూ! మన బట్టలకొట్టు చిన్నబ్బాయ్ చిన్నకొడుకు రేపల్లెలో కొత్తగా ఒక దుకాణం పెట్టాడట. వీడు ఒప్పుకుంటే వాడి కొట్లో వీడిని పనికి కుదురుస్తాను. నెలయ్యేసరికి కొంత ఆదాయం వుంటుంది. ఇలాంటి కక్కుర్తి పనులు వీడు ఇక చెయ్యడు..ఏమంటావురా తమ్ముడూ" అన్నది బామ్మ.

"ఇన్నాళ్లూ బాధ్యత లేకుండా ప్రవర్తించానే అక్కయ్యా! పిల్లల గురించి, పెళ్లాం గురించీ ఆలోచించలేదు. మీరంతా నా కళ్లు తెరిపించారు. నీవు చెప్పినట్టే పని చేసుకుని బ్రతుకుతాను" బుద్ధిమంతునిలా అన్నాడు కెపిరావు.


ఆ తర్వాత బట్టలకొట్లో పద్దు వేయించి అందరికీ బట్టలు ఇప్పించింది బామ్మ.

"నిజంగా నీవు దేవతవే అక్కయ్యా!" కంట నీరు పెడుతూ బామ్మ కాళ్ల మీద పడ్డాడు కెపిరావు. బామ్మ తన బోసినోటితో నవ్వుతూ అయనను ఆశీర్వదించింది.

బామ్మ పెట్టిన భిక్షతో ఆ తర్వాత బాగానే పైకి వచ్చాడాయన. గతించిన రోజులే గొప్పవి. పక్కవాడు ఏమవుతున్నా పట్టించుకోని రోజులివి. ఒకరంటే ఒకరు గొప్పగా ఉండాలన్న తాపత్రయం తప్ప...హీనంగా దీనంగా వున్న వారికి చేయూతనిద్దామనే కనీసపు ఆలోచన రాని హడావిడి బ్రతుకులు మనవి...

ఇంకా ఎన్నో జ్ఞాపకాలు... గతం నుంచి వర్తమానంలోకి రాగానే కిందకి దిగి రమ్మంటూ నా భార్యామణి పిలుపునకు జ్ఞాపకాల తలుపుకి తాత్కాలికంగా గొళ్లెంవేసి కిందకి మెట్లు దిగాను.

○



## కంగనా రూటే వేరు!

*బాలీవుడ్ కెరీర్ ఆరంభంలో సీరియస్ పాత్రల్నే పోషించిన కంగనా రనౌత్ సడెన్‌గా రొమాంటిక్ గెటప్పుల్లో రెండు మూడు సినిమాల్లో హాట్ హాట్‌గా దర్శనమిచ్చింది. తెలుగులో 'ఏక్ నిరంజన్' సినిమాలోనూ కంగనా బోల్డు సోయగాల్ని ఒలకబోస్తున్నట్టు టాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. కంగనా మాత్రం తను ఇలాంటి రొమాంటిక్ పాత్రలు చేయడం వల్ల రిలీఫ్‌గా ఫీలవుతున్నానంటోంది. మరీ నటనతో సీరియస్ వేషాలు చేస్తుంటే బోర్ కొడుతుంది. సినిమాలంటే గ్లామర్ ఫీల్డు కదా! అందుకనే గ్లామర్‌ని ఆరేస్తుంటే ఆ థ్రిల్లే వేరు కదా!*